www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
17.11.2026



- శ్రీశైలం జలాశయంలో కనీస స్థాయి కంటే దిగువకు నీటిమట్టం
- నిలిచిపోయిన జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల ప్రవాహాలు
- వరుసగా వాయిదా పడుతున్న కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ సమావేశాలు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య తేలని తాగునీటి కేటాయింపులు 5లో..
- సకాలంలో నిర్ణయాలు తీసుకోకుంటే వేసవిలో తీవ్ర ఎద్దడి తప్పదు





తెలంగాణకు తాగునీటి గండం!


కృష్ణా జలాశయాల్లో నీటి నిల్వలు రోజురోజుకూ ప్రమాదకర స్థాయికి పడిపోతుండడం, మరోవైపు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) సమావేశాలు నిరంతరం వాయిదా పడుతుండడంతో తెలంగాణలో తీవ్ర తాగునీటి సంక్షోభం పొంచి ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో జల వివాదాలు, నీటి పంపకాల సమస్యలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో రానున్న వేసవిలో రాజధాని హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు తాగునీటి ఇబ్బందులు తప్పవని నీటి పారుదల రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర అల్పాజోలం ముఠా అరెస్ట్



2లో

- రూ.38 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- ఆరుగురు అరెస్ట్, ఒకరు పరారీ
- కర్ణాటక, ఏపీ కేంద్రంగా డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్
- మాదకద్రవ్యాల అక్రమ తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం



కోటగుళ్లకు కార్తీక శోభ

- శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు
- తులసి, మారేడు చెట్ల వద్ద మహిళల దీపదానం
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన పరిరక్షణ కమిటీ

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా గణపురం మండల కేంద్రంలోని చారిత్రక కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, ఎంపీడీవో ఎల్. భాస్కర్ తదితర అధికారులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా మహిళలు తులసి, మారేడు చెట్ల వద్ద దీపాలు వెలిగించి దీపదానం చేయడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టగా, పూజల అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

- కలంజ్యోతి, భూపాలపల్లి



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
మంగళవారం 17.11.2026
www.kalamjyothi.com



అంతర్రాష్ట్ర అల్ప్రాజోలం ముఠా అరెస్ట్

- రూ.38 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- ఆరుగురు అరెస్ట్, ఒకరు పరారీ
- కర్ణాటక, ఏపీ కేంద్రంగా డ్రగ్స్ తయారీ, సరఫరా నెట్‌వర్క్
- మాదకద్రవ్యాల అక్రమ తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : అక్రమంగా అల్ప్రాజోలం తయారు చేసి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. బిజినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ శివారులో వ్యవసాయ పొలంలోని రేకుల షెడ్డులో రహస్యంగా అల్ప్రాజోలం తయారు చేస్తున్న ముఠాపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుల విచారణ ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా కూనర్‌పల్లిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని గుర్తించగా ఆరుగురు పట్టుబడ్డారని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర స్థాయిలో డ్రగ్స్ నెట్‌వర్క్ గుర్తింపు..

ఈ నెల 15న అందిన పక్కా సమాచారంతో బిజినపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 455లో ఉన్న రేకుల షెడ్డుపై పోలీసులు దాడి చేశారు. అక్కడ అల్ప్రాజోలం తయారు చేస్తున్న నిందితులను విచారించగా అంతర్రాష్ట్ర స్థాయిలో ముడిసరుకుల సరఫరా, తయారీ, విక్రయాల నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలోని రాయచూర్ నుంచి ముడిసరుకులు తెప్పించి, ఆంధ్రప్రదేశ్‌లోని కూనర్‌పల్లిలో ప్రాథమిక దశల ప్రక్రియ పూర్తి చేసి, బిజినపల్లిలో తుది దశలో అల్ప్రాజోలం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. తయారైన మాదకద్రవ్యాన్ని కల్లు కాంపౌండ్లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.

మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం..

ఈ దాడుల్లో రూ.26 లక్షల విలువైన 2.6 కిలోల అల్ప్రాజోలంతో పాటు రూ.12 లక్షల విలువైన తయారీ పరికరాలు, రసాయనాలు, పౌడర్, ఆరు మొబైల్ ఫోన్లు కలిపి మొత్తం రూ.38 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ మాదక ద్రవ్యాల అక్రమ తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ ఆధ్వర్యంలో కేసును ఛేదించిన సీఐ అశోక్ రెడ్డి, సీసీఎస్ సీఐ శంకర్, బిజినపల్లి ఎస్సై శంషుద్దీన్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



బోజేర్వు పాఠశాలలో డిజిటల్ బోర్డు ప్రారంభం

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్యకు దాతల తోడ్పాటు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : మండలంలోని బోజేర్వు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక డిజిటల్ బోర్డును సోమవారం మండల విద్యాశాఖ అధికారి పాపమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం డిజిటల్ బోర్డు ద్వారా జరుగుతున్న బోధనా విధానాన్ని పరిశీలించిన ఆమె, ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, దాతలు, పాఠశాల సలహాదారులను అభినందించారు. మన బడి అభివృద్ధి - మనందరి బాధ్యత అనే నినాదానికి నిదర్శనంగా దాతలు అందించిన విరాళాల వివరాలను పాఠశాల గోడపై పెయింటింగ్ ద్వారా ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డిజిటల్ బోర్డు ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు మరింత దోహదపడుతుందని వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ఎర్ర రవీందర్, సర్పంచ్ కుసుమ సతీష్, ఉపసర్పంచ్ పెద్దబోయిన ఎల్లయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల టీటీఎఫ్ అధ్యక్షుడు అంగోత్ భద్రయ్య, లోల్లటి రమేష్, పాఠశాల సలహాదారు నూకల కృష్ణ యాదవ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు పిల్లల నాగరాజు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 17) : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆశాలు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఏకశిల పార్క్ నుండి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, బీఆర్‌టీయూ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి జనాభాకు, పట్టణ ప్రాంతాల్లో రెండు వేల నుండి ఐదు వేల జనాభాకు ఒకరు చొప్పున బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలు ఆశా వర్కర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. గర్భిణులకు ఆసుపత్రిలో డెలివరీ అయ్యేలా చూస్తూ తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడటంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

రూ.18 వేల వేతనం ఇవ్వాలి..

సీజనల్, అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నును అరికట్టడంతో పాటు సబ్ సెంటర్ డ్యూటీలు, ఏఎంసీ, పీఎంసీ, ఎన్‌సీడీ, ఆన్‌లైన్ సర్వే, ఎగ్జామ్ డ్యూటీలు, డ్రైడే, ఫ్రైడే, లెప్రసీ, పల్స్ పోలియో లాంటి అనేక పనులు ఆశా వర్కర్లతో చేయిస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీరితో వెట్టిచాకిరి చేయిస్తూ పారితోషికాల పేరుతో తక్కువ వేతనాలు ఇవ్వడం సరికాదని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 28 వేల మంది ఆశా వర్కర్లు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి (బీఆర్‌టీయూ) పాలడుగుల రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ బీఆర్‌టీయూ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షురాలు కలవాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య, సీఐటీయూ అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ రాణి, నాయకులు తంగెళ్ల సుజాత, పిట్టల శ్రీలత, రూపిక, సాలమ్మ, అనిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఐక్యంగా పనిచేయాలి
- నైన్‌పాకలో టీఆర్పీ జెండా ఆవిష్కరణ



కలంజ్యోతి, భూపాలపల్లి (నవంబర్ 17) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) గద్దె జెండాను జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. నూతనంగా చేరిన నాయకులు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజ్యాధికారం కోసం తీన్మార్ మల్లన్న చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం సాధించడమే టీఆర్పీ లక్ష్యమని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, సత్వర న్యాయం అందించేందుకు పార్టీ కృషి చేస్తోందని, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహబూబ్ అలీ, మండల నాయకులు పుట్ట మొగిలి, ముదాస్తు రమేష్, గాజుల రమేష్, ఆకునూరి పంశీకృష్ణ, భాషవేణి రవీందర్, రాయారాకుల రవి, రేపాల కిరణ్, గాజుల తిరుపతి, గాజుల శ్రీకాంత్, మహమ్మద్ రంజాన్, డాక్టర్ రామరాజు, గాజుల



సురేష్, దుద్దేటి శ్రీను తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

3

మంగళవారం 17.11.2026

www.kalamjyothi.com



పట్టుదలతో చదివితే విజయం సాధ్యం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కలంజ్యోతి, భూపాలపల్లి (నవంబర్ 17) : పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్న అభ్యర్థులకు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ పేద నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి, పోలీస్ ఉద్యోగాలకు అవసరమైన గ్రౌండ్ కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ వరకు శిక్షణ కొనసాగిస్తామని, అభ్యర్థులు ఉద్యోగాలు సాధించే వరకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.





ఆదివాసీ సంఘాలను విస్మరించడం అవమానకరం

బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

కలంజ్యోతి, కొత్తగూడ (నవంబర్ 17) : కొత్తగూడ మండల కేంద్రంలో నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి జనజాతీయ గౌరవ దివస్ వేడుకలకు స్థానిక ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలకు సమాచారం ఇవ్వకపోవడంపై తుడుందెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో పాల్గొన్న కార్యక్రమంలో ఆదివాసీ సంఘాలను విస్మరించడం అవమానకరమని విమర్శించారు. బిర్సా ముండా ఆశయాలు, ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంఘాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై గిరిజన శాఖ మంత్రి, కమిషనర్ విచారణ జరిపించి ఐటీడీఏ పీవో, మహబూబాబాద్ డీడీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంజ నర్సింగరావు, పూనేం సందీప్ కుమార్, సిద్దబోయిన భాస్కర్, మల్లెల సారయ్య, సిద్దబోయిన కిషోర్, సొలం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్ ఇవ్వాలి

- ప్రకటనల ఆదాయంలో 10 శాతం వాటా కేటాయించాలి
- నిధుల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

కలంజ్యోతి, భూపాలపల్లి (నవంబర్ 17) : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ సమాజంలో ప్రజల గొంతుకగా నిలుస్తున్న జర్నలిస్టుల జీవితాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని భూపాలపల్లి జిల్లా రిపోర్టర్లు పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్ పథకంతో పాటు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల జీవితాల్లో మాత్రం పదవీ విరమణ తర్వాత అనిశ్చితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి గౌరవప్రదమైన జీవనానికి భరోసా కల్పించాలని, ఇందుకోసం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి వార్తాపత్రికలు, మీడియా సంస్థలకు వచ్చే ప్రభుత్వ, ప్రైవేటు ప్రకటనల ఆదాయంలో 10 శాతం వాటాను నిధికి కేటాయించాలని ప్రతిపాదించారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలి..

ప్రకటనల ఆదాయ వాటాకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం నిధులను మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో సమకూర్చాలని రిపోర్టర్లు విజ్ఞప్తి చేశారు. ఈ నిధులతో అర్హులైన జర్నలిస్టులకు పెన్షన్, సంక్షేమ ప్రయోజనాలు అందించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని కోరారు. నిధుల నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి పారదర్శకంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, పథకం అమలుకు అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, సీనియర్ సంపాదకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించాలని సూచించారు. పత్రికలు, మీడియా సంస్థలు, సంఘాల పేరుతో ఎలాంటి వివక్ష లేకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఈ పథకం ద్వారా న్యాయం జరిగేలా చూడాలని, ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో తిక్క ప్రవీణ్, సామంతుల శ్యామ్, నరేందర్, అడ్డగట్ల శ్రీనివాస్, నెరెళ్ళ జోసెఫ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సొసైటీ చైర్మన్ పరామర్శ

పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ గ్రామంలోని హరియా నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త మూడు బాలు నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్, స్థానిక సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్‌తో కలిసి మృతుని స్వగృహానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న, నాయకులు బోనగిరి సారయ్య, బాధవత్ పెద్ద వీరు, బాధవత్ వీరు నాయక్, బాధవత్ చందర్, తేజవత్ బద్రు నాయక్, బాలాజీ, రాజేందర్, వీరు, వస్రం, వీరు నాయక్, రాంసింగ్, మైనారిటీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కయాజ్, వార్డు సభ్యులు ఒంటరి రాజు, ఇస్లావత్ స్వరూప, వీరు, బాధవత్ సురేష్, బూత్ అధ్యక్షులు తేజవత్ శివ, కరెడ్ల శివకిషోర్, బీమా దేవా, తేజవత్ రాజు, రాజేష్, శ్రీకాంత్, వీరు, లాల నర్సింహా, బాధవత్ రవి, రవీందర్, నవీన్, మూడు వెంకన్న, రాజు, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమాచార హక్కు దరఖాస్తులపై అధికారుల జాప్యం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : వరంగల్ జిల్లా డీఆర్‌డీఏ, సెర్ప్, శ్రీనిధి సంస్థల నిధులు, సంక్షేమ పథకాలపై సమాచార హక్కు చట్టం కింద సమర్పించిన 18 దరఖాస్తులకు అధికారులు పూర్తి సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి ఆరోపించారు. ప్రభుత్వం నుంచి పలు మెమోలు జారీ అయినా నిధుల ఖర్చులు, బ్యాంకు లావాదేవీలు, కొనుగోళ్లు, ఆడిట్ నివేదికల వివరాలను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని కోరినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఆయా సంస్థలకు వచ్చిన నిధులు, స్వయం సహాయక సంఘాల రుణాలు, పాడి పశువులు, డెయిరీ, పౌల్ట్రీ యూనిట్ల పంపిణీ, వ్యవసాయ యంత్రాల కొనుగోళ్లు, రైతుల పంటల చెల్లింపుల రికార్డులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాధనం ఖర్చులో పారదర్శకత ఉండాలని, ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా అందించాలని కాట కుమారస్వామి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
మంగళవారం 17.11.2026
www.kalamjyothi.com

అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోగులు రాణాప్రతాప్ రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 17) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కొత్త చేయూత పెన్షన్ల మంజూరులో జాప్యం కొనసాగుతోందని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లోనే, సంక్రాంతి, ఉగాది, ఆగస్టు 15, దసరా, దీపావళి పండుగలకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, పలుమార్లు వాయిదా వేసిన ప్రభుత్వం ప్రస్తుతం కొద్దిమందికే మంజూరు చేసి మిగిలిన అర్హులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు నాలుగో వంతు మందికే పెన్షన్లు ఇవ్వడం జరిగిందని, మిగిలిన అర్హులకు ఎందుకు మంజూరు చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మూడేళ్లుగా ఎదురుచూస్తున్న వృద్ధులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడంపై ప్రశ్నించారు.

ఎంపిక జాబితాను పంచాయతీల్లో ప్రకటించాలి..

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికుల్లో అర్హులైన వారందరికీ 100 శాతం పెన్షన్లు ఎప్పటిలోగా మంజూరు చేస్తారో స్పష్టం చేయాలని కోరారు. పెన్షన్ల ఎంపికకు సంబంధించిన తుది జాబితా, అర్హత నిబంధనలు, ఎంపిక వివరాలను గ్రామ పంచాయతీల్లో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

హామీ మేరకు పెంచిన పెన్షన్లు అమలు చేయాలి..

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి పెన్షన్‌దారుడికి రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రజలకు తెలియజేయాలని కోరారు. మూడేళ్లుగా కొత్త పెన్షన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న అర్హులకు వెంటనే న్యాయం చేయాలని, ముఖ్యంగా వృద్ధుల దరఖాస్తులను పరిశీలించి పెన్షన్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు.



నిరుద్యోగుల గొంతుకగా నిలిచిన శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించాలి

శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతుగా ములుగులో అనిల్ కుమార్ నాయక్ ప్రచారం

కలంజ్యోతి, ములుగు (నవంబర్ 17) : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతుగా ములుగు జిల్లాలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డా. బోడ అనిల్ కుమార్ నాయక్ నాయకత్వంలో నలమాస శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి ప్రచారం చేపట్టగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



గిరిజన, ఆదివాసీ పట్టభద్రులు సంఘటితమై మద్దతు ఇవ్వాలి..

ఈ సందర్భంగా డా. బోడ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై గొంతుకగా నిలిచి పోరాడుతున్న శ్రీకాంత్ గౌడ్‌కు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా ములుగు జిల్లా పరిధిలోని గిరిజన, ఆదివాసీ పట్టభద్రులు సంఘటితమై ఎన్నికల ప్రచారంలో భాగస్వాములై తమ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు సందీప్, క్రాంతి, నరేష్, లచ్చిరాం, సురేందర్, అభిషేక్, సుధాకర్, వంశీ, అరుణ్, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు తాగునీటి గండం!

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 17) : కృష్ణా జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) సమావేశాలు నిరంతరం వాయిదా పడుతుండడంతో తెలంగాణలో తాగునీటి సంక్షోభం పొంచి ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాల సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రానున్న వేసవిలో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.

శ్రీశైలంలో 829.10 అడుగులకు పడిపోయిన నీటిమట్టం..

ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.10 అడుగులకు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, కనీస నీటిమట్టం (834 అడుగులు) కంటే దిగువకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం కేవలం 48.57 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీలు తగ్గుదల..

జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల నుంచి శ్రీశైలానికి ఇన్‌ఫ్లోలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీల మేర నీటి నిల్వలు తగ్గాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వార్షిక ప్రవాహాలు 218 టీఎంసీలకు మాత్రమే పరిమితమయ్యాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రతకు నీరు ఆవిరి కావడం, వేసవి డిమాండ్ పెరగడం వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది.

అజెండాపై ఏకాభిప్రాయం కుదరక ఆగిన బోర్డు భేటీలు..

మే నెల నుంచి జరగాల్సిన 21వ కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. చివరిసారిగా 2025 జనవరి 21న ఈ సమావేశం జరిగింది. అటు అజెండాపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 18వ జీఆర్ఎంబీ సమావేశం కూడా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కేటాయింపులపై కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది.

46 టీఎంసీల తాగునీటిని కేటాయించాలని తెలంగాణ పట్టు..

జనాభా ప్రాతిపదికన లేదా 50:50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు 5 టీఎంసీలతో పాటు, జూలై వరకు హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం జిల్లాల అవసరాలకు మొత్తం 46 టీఎంసీల తాగునీటిని కేటాయించాలని తెలంగాణ గట్టిగా పట్టుబడుతోంది.

బోర్డుల జాప్యంతో దక్షిణ తెలంగాణ జిల్లాలకు పెను ముప్పు..

నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు మరింత ఆలస్యమై, నీటి పంపకాలపై సకాలంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకుంటే వేసవిలో పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉంది. ఇప్పటికే నీటి నిల్వలు అడుగంటుతున్న నేపథ్యంలో తక్షణమే కేఆర్ఎంబీ జోక్యం చేసుకుని తెలంగాణ తాగునీటి అవసరాలకు తగినన్ని జలాలు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవు
సబ్ ఇన్ స్పెక్టర్ ఎన్. రమేష్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (నవంబర్ 17) : మహిళతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా బూతులు తిట్టి దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. మండలంలోని కిష్టునాయక్ తండా గ్రామానికి చెందిన ఒక మహిళ ఇంటి ఆవరణలోకి అదే గ్రామానికి చెందిన మాలోతు హనుమంతు (39) అక్రమంగా ప్రవేశించి బూతులు తిడుతూ చేతులతో కొట్టడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించి వేధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడటం, దాడులు చేయడం, మహిళల గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధిత మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



నెక్కొండలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కలంజ్యోతి, నెక్కొండ (నవంబర్ 17) : నెక్కొండ మండల ప్రజల సౌకర్యార్థం జనతా ట్రస్ట్, శంకర ఐ ఫౌండేషన్ ఇండియా, శ్రీ కాంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 17న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు. నెక్కొండలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, వైద్యుల సలహాలతో పాటు అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు, కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్ కార్డు, అవసరమైన వైద్య పత్రాలను వెంట తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 99499 63083, 97010 53729, 99518 21542, 98859 84120, 94921 08301, 91772 03899 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గ్రామీణ ప్రాంతాలకు బస్సులు కల్పించాలి

విద్యార్థుల ఇబ్బందులపై అధికారులు స్పందించాలి

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండలంలోని బస్సు సౌకర్యం లేని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు కల్పించాలని కోరుతూ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, చెరువుకొమ్ము తండా సర్పంచ్ భూక్యా మైబు సింగ్ రాథోడ్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీవో సాయి శివానంద్, తహసీల్దార్ అభిద్ అలీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెరువుకొమ్ము తండా, అమృత తండా, కందిగడ్డ తండా, బోడ మాణిక్యం తండా, ధర్మ తండా, సూర్యపేట తండా, గొల్లబామా తండా, గొల్లపెల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, మహిళలు, సామాన్య ప్రజలు నర్సంపేట, నెక్కొండ పట్టణాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు, విద్యార్థుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరగా, దీనిపై ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ బస్సులు నడిపేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు మైదాం రాకేష్, లావణ్య, హనుమా నాయక్, రవీందర్, జ్యోతి, వెంకన్న, మండల నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

సూర్య చిత్రంలో ఐశ్వర్యలక్ష్మి

దక్షిణాది చిత్రాల్లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మికి మరో క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కింది. జై భీమ్ ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సూర్య 48 చిత్రంలో కీయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇందులో ఓ కీలక అతిథి పాత్ర కోసం దర్శకుడు స్వయంగా ఐశ్వర్య లక్ష్మిని సంప్రదించినట్లు సమాచారం. నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ కథను మలుపు తిప్పే బలమైన పాత్ర కావడంతో ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సాయి దుర్గా తేజ్ సరసన సంబరాల ఏటిగట్టు చిత్రంలో నటిస్తున్న ఐశ్వర్య లక్ష్మి సూర్య సినిమాలో భాగం కావడంపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.